# మరో ప్రపంచం

**డా॥ భానుమతీ రామకృష్ణ**

*అక్షరాలా ఆమె బహుముఖ ప్రజ్ఞాశాలి. సంగీత సాహిత్య కళారంగాలలో ఆమె బాణీ, వాణి ప్రత్యేకం. భానుమతి అత్తగారి కథలు అశేష తెలుగు పాఠకుల ఆదరణ పొందాయి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ అవార్డు అందుకున్నాయి. సున్నితమైన హాస్యం, పరిశీలన, ఆసక్తిగా చెప్పగల నేర్పు - అత్తగారి పాత్రను చిరంజీవిని చేశాయి.*

అలనాడు బ్రహ్మ మట్టితో మానవసృష్టి అంతా చేశాడని పెద్దవాళ్ళు కథలు చెబుతూ వుంటారు - బ్రహ్మ మనిషి తలా, కాళ్ళూ చేతులూ చేశాడేగాని అవి విరిగిపోకుండా చేయలేకపోయాడు - అవి విరిగినప్పుడు పుత్తూరు వైద్యుల దగ్గిరికి వెళ్ళాల్సిందేగాని బ్రహ్మమాత్రం 'రిపేర్ వర్క్' పెట్టుకోలేదు - కేవలం సృష్టించడం వరకే తన పని అన్నాడు - ఈ విషయంలో ఆయన మానవకోటిని చిన్నచూపు చూశాడనే చెప్పాలి - పోనీ సృష్టి తను చేసి, 'రిపేర్ వర్క్'కి ఒక అసిస్టెంటుని పెట్టుకుంటే ఈరోజు యిన్ని హాస్పిటల్సూ వుండేవి కావు. యం.బి.బి.యస్. సీట్ల కింత డిమాండూ వుండేదికాదు-

మానవులకు ఆ కొరత బ్రహ్మవల్ల తీరకపోయినా, మా కొలువు బొమ్మలకు ఆ కొరత లేకుండా నేను ప్రతి సంవత్సరమూ 'ఫ్రాక్చర్' అయినవాటినీ, 'యాక్సిడెంట్ల'ల్లో తలలూ కాళ్ళూ, చేతులూ విరిగినవాటినీ, వేరేగా తీసి, తక్షణం తలలు లేనివాళ్ళకు తలలూ (వాళ్ళవేలెండి), చేతులు లేనివాళ్ళకు చేతులూ, చర్మం పెట్లిన చర్మం (రంగులెండి) వగైరా కావలసినవన్నీ తగిలించి బొమ్మలన్నిటినీ 'రిపేర్' చేసి, కొత్త బొమ్మలతో పాటు పాతవాటిని తీర్చిదిద్దుతూంటాను. అయినా విధి నెవరు తప్పించగలరు! అన్నట్లు కొన్నిటిని రిపేర్ చేయలేకపోతుంటారు - ఉదాహరణకు, ఒకడు ఆవుకు నీళ్ళు పెడుతున్నాడు - తొట్టి వుంది. ఆవులేదు - వాడి తల కూడా లేదు - నీళ్ళు పడుతూ కూర్చున్నవాడి చెయ్యిమాత్రం తొట్టి దగ్గరకి చాచి వుంది. వాడి తల కోసం బొమ్మలపెట్టెలన్నీ గాలించాం - ఎక్కడా దొరకలా - యింక యెవరెవరి తలలో దొరికాయి. ఆ తల లెవరివో తెలుసుకోడానికి ఆ తలల్లేని వాళ్ళకోసం గాలించడం మొదలెట్టాం. కొన్ని దొరికాయి. కాని ఆవుకు నీళ్ళుపట్టేవాడి తలా, ఆవూ రెండు దొరకలా-

ప్రతి సంవత్సరం ఏదో ఒక వూరూ, దానికి రోడ్లూ అవీ వేస్తుంటాం గనుక రోడ్డుమీద ఒక చెత్తబండినీ దాన్ని తోలేవాడినీ పెడుతుంటాం... ఈ సంవత్సరం ఆ చెత్తబండివాడు బండిమీద

**ఆణిముత్యాలు**

కనిపించలా... ఏమైనాడు?... వెతికాం... ఊహూఁ! సరే. ఏ బీడీకొట్టుకో వెళ్ళి వుంటాడనుకుంటార్లే కొలువు చూట్టానికి వచ్చినవాళ్ళు.... అని సమాధానపడి రోడ్లు వూడ్చేవాడొకడుంటే వాడిని తెచ్చి ఆ బండిపక్కన నిలబెట్టాం. చేతిలో చీపురుతో వచ్చీ పోయేవాళ్ళనిచూస్తూ బండిపక్కన నిలబడ్డాడు.

పాపం ఒక పెళ్ళి ఊరేగింపు... ఆ బొమ్మల సెట్టులో యిరవై అయిదు బొమ్మలుంటాయి. పూలమాలలతో అలంకరించిన కార్లో కూర్చున్న నూతన దంపతులూ, వాళ్ళ తలిదండ్రులూ, అత్తమామలూ, పిల్లల్ని ఎత్తుకుని,

పేరంటాళ్ళతోనూ వారి వారి బంధుకోటితోనూ కారు వెనక నడుస్తుంటే, మేళగాళ్ళు ముందు వెడుతుంటే పెట్రోమాక్సులైట్లు తలమీద పెట్టుకున్నవాళ్ళు దారి చూపుతుంటే ముచ్చట్లాడుతూ, నవ్వుతూ, పేలుతూ నడుస్తున్న ఆ పెళ్ళివాళ్ళంతా పోయిన సంవత్సరం కొందరూ, ఈ సంవత్సరం అందరూ యాక్సిడెంట్ల పాలయినారు... కార్లో వున్న నూతన దంపతులు పూలమాలలతో చెక్కుచెదరకుండా కార్లోనే వున్నారు. వాళ్ళ కే ప్రమాదం కలగలేదు. డ్రైవర్ చేతుల్లో స్టీరింగుతో సహా వేరేగా కనిపించాడు... అరెరె!

యితను పెళ్ళి సెట్టులో డ్రైవర్‌గదా! యిట్లా ఎందుకు పడివున్నాడు? అని మేమంతా ఆశ్చర్యపడుతూంటే అతని పక్కనే పెళ్ళికూతురు తల్లిదండ్రులూ, తదితర బంధుకోటి కాళ్ళు విరిగి కదల్లేని స్థితిలో పడివున్నారు... మేళగాళ్ళంతా ప్రమాదకరమైన యాక్సిడెంట్ల పాలైనారు. ఇతనికి చేతులో వున్న సన్నాయితోబాటు చెయ్యీ విరిగింది. డోలు వాయించేవాడి డోలుతోబాటు తలకూడా పగిలింది, తాళం వేసేవాడి తల వుంది. కాళ్ళు పోయాయి. బూరగవూదే వాడి బుగ్గలుమాత్రం నిగనిగలాడుతూ వున్నాయి – అంతా పోయాక యిక అతనొక్కణ్ణి ఆ కారుపక్కన నిలబెడితే ఏం బావుంటుందీ! ప్చ్! లాభంలేదు. ఆ సెట్టు తీసి మూలపడేశాం – అందులో చావుతప్పి కన్నులొట్టబోయి బ్రతుకుజీవుడా అంటూ ఓ మూల కనిపించిన యిద్దరు ముగ్గురు పెళ్ళివారిని తీసుకెళ్ళి ఓ దేవాలయం ముందు నిలబెట్టాం. గుంపులో గోవిందా అన్నట్లుంటారని–

ఒక 'ట్రాఫిక్' పోలీసు పాపం – మూడు సంవత్సరాలుగా చేతులో 'స్టాప్ ప్లేటు'తో వచ్చేపోయే కార్లను ఆపుతూ, పంపుతూ వున్నాడు కొలువులో. అలాంటివాడు యీ సంవత్సరం ఘోర ప్రమాదానికి గురియైనాడు – కాళ్ళు రెండూ పడి బూట్లతో సహా మోకాళ్ళదాకా విరిగాయి – ముక్కు చదరమైంది. పక్కకు చాచినచెయ్యి చాచినట్లే వుంది. 'స్టాప్ ప్లేట్ పట్టుకున్న చెయ్యి' కాస్తా విరిగింది – లోపల యినపతీగ ఉన్నందువల్ల కంట్రోల్లేకుండా మణికట్టు దగ్గర్నుంచి ఎటు తిప్పితే అటు తిరగటం మొదలెట్టింది – అలాంటి పోలీసు 'ట్రాఫిక్ కంట్రోల్' చెయ్యబోతే అతనిగతే అందరికీ పడుతుందని తక్షణం అతన్ని సర్జరీ వార్డుకి తరలించాం–

రక్తి, భక్తి, ముక్తి అన్న పదాలకు తాత్పర్యంలాగా ఒకవైపు గోపికా వస్త్రాపహరణం, రెండోవైపు గజేంద్ర మోక్షం, మధ్యలో ఆదిశంకరులు శిష్యకోటితో కూర్చుని వుండటం, మూడూ వరసనా ప్రతి సంవత్సరమూ కొలువులో అమర్చటం జరుగుతోంది. వీటిల్లో గజేంద్రమోక్షం చాలా సున్నితమైంది. అందుకే చాలా భద్రంగానే చూస్తూంటాం దాన్ని – కాని యీసారి మా పసిపిల్లవాడు దాన్ని పెట్టెలోనుంచి చటుక్కున తీయడంలో ఒంటి కాలిమీది నిలబడ్డ గజేంద్రుడు 'బేలెన్సు' తప్పి కిందపడి కాలుదగ్గర్నుంచి రెండుగా చీలాడు. అరెరె! రెండో కాలు ఏది? అదీ విరిగిందా? అంటూ ఖంగారు పడ్డాం... తీరా చూస్తే, రెండో కాలు మొసలినోట్లో 'సేఫ్'గా వుంది – ఏనుగు రెండుగా చీలడంచేత అతికించడం అతి సులభం అని సర్జరీవార్డ్‌కి మళ్ళించాం ఏనుగును... "సర్జరీవార్డ్"కి "హెడ్"గా మా చెల్లెలి కొడుకు చంద్రూ వాడికి అసిస్టెంట్ మా ఆడబిడ్డ మనవడు రామశాయి... చంద్రూకి విరిగిన బొమ్మలు అతికించడం అంటే విపరీతమైన సరదా... వాడికెంత సరదా అంటే కొన్ని మంచి బొమ్మలు కూడా ''సైలెంట్''గా విరగ్గొట్టి అతికిస్తూంటాడని చంద్రూమీద కోపం వచ్చినప్పుడు రామశాయి పితూరీ చెబుతుంటాడు. రామశాయి గమ్మూ, మట్టీ అందిస్తూంటే చంద్రూ అతి నైపుణ్యంగల సర్జన్ లాగా పోజుపెట్టి బొమ్మలు అతికిస్తూంటాడు... వాడే తీసుకెళ్ళాడు ఏనుగును బ్రతికిస్తానని...

మరుక్షణం ఆ సెట్టుతీసి అవతల పెట్టడంలో మొసలి గూడా కిందపడి మూడు ముక్కలైంది. కాని గజేంద్రుడి కాలుమాత్రం వదల్లేదు. మొత్తానికి మొసలి చచ్చి సాధించాననిపించుకుంది. యిక ఆ సెట్టులో మిగిలిందల్లా కాస్త ఎత్తుగా వున్న చిన్న కొండ, ఆ కొండపైన శ్రీదేవి, భూదేవిలతో కొండలోకి గుచ్చివున్న యినపచువ్వమీద నిలబడ్డ గరుత్మంతుడి వీపుమీద కూర్చుని, గడమీదెక్కి

సాముచేసే వాడిలాగా తనెప్పుడు కిందపడతానో అనే భయంతో యిద్దరి భార్యల నడుములూ రెండు చేతుల్తో గట్టిగా పట్టుకుని బెదిరిపోయి చూస్తున్నాడు బదరీనారాయణుడు...

ఆ సెట్టు రిపేరుచేసి ప్రయోజనంలేదని తీసి ఓ మూల పడేశాం... యిక ప్రతి సంవత్సరమూ మాకు 'న్యూసెన్స్'గా కనిపించే బొమ్మలసెట్టు ఒకటుంది. అదే గోపికా వస్త్రాపహరణం.

మొత్తం ఎనిమిది మంది గోపికలున్నారు. అదే లెండి బట్టల్లేకుండానే... చుట్టూ వున్న చీరలతో చెట్టుమీద కృష్ణుడు మురళి వాయిస్తూ కూర్చున్నాడు. గోపిక వంపు సొంపుల్లో మట్టి మరికాస్త జాస్తి పెట్టాడు ఆ బొమ్మలు చేసిన బ్రహ్మ – మా యింట్లో పనిచేసే వాళ్ళంతా అటూ యిటూ వస్తూ పోతూ ఆ గోపికలందర్నీ తనివితీరా చూస్తూ వేడి నిట్టూర్పులు విడుస్తూంటారు – వాళ్ళలో పెళ్ళికాని యాభై యేండ్ల నాగప్ప ఆ గోపికల్ని రోజుకు రెండుసార్లు తుడుస్తుంటాడు దుమ్ము పడిందని– గోపికలంతా కోనేట్లో స్నానం చేస్తున్నారు – ఆ కోనేటికి చుట్టూ మెట్లున్నాయి – ఆ మెట్లమీద కొందరు గోపికలు కూర్చుని కృష్ణుడికి నమస్కారం చేస్తున్నారు. కొందరు నిలబడి చేతులెత్తి నమస్కరిస్తున్నారు. గోపికల సెట్టు తీసుకెళ్ళి మిగతా బొమ్మల వెనక దాచాం... అయినా పనిచేసే మగపురుగులు ఆవేపు తిరగడం చూసి కొలువురోజుదాకా బయటికి తీయకూడదని వాళ్ళందర్నీ 'సెన్సార్' గదిలో వుంచాం.

ఆ బొమ్మ సెట్టు లోపల దాచేసరికి పనివాళ్ళల్లో ఉత్సాహం తగ్గింది. అంతకు ముందు గోపికల్ని చూస్తూ మేం అడక్కపోయినా అన్ని పనుల్లోనూ సహాయపడుతుండిన నాగప్ప పదిసార్లు పిల్చినా పలకడంలేదు –

ప్రస్తుతం సినిమాల్లో 'ఎక్స్ట్రా ఎంటర్‌టెయిన్‌మెంట్' ఏ మోతాదులో వుందో, ఆ మోతాదులో కనిపిస్తున్న గోపికల్ని పనివాళ్ళ కోసం తీసి బయటపెట్టి వాళ్ళ కుత్సాహం కలిగించి పన్లు చేయించే స్థితికి దిగజారడం యిష్టం లేక కొలువుకు సంబంధించిన పన్లన్నీ నేనూ, మా చెల్లెళ్ళూ కష్టపడి చేస్తున్నాం–

సినిమాల్లో పౌరాణికాలూ, జానపదాలూ, సాంఘికాలూ వున్నట్లు గోపికా వస్త్రాపహరణం దగ్గర్నుంచి అపోలో–11 దాకా అన్నీ వున్నాయి మా యింటి కొలువులో.

అపోలో నుండి తీసిన ఫొటోల్లో భూమి గుండ్రంగా చంద్రుడికంటే అందంగా కనిపిస్తోంది. ఆ ఫొటోలు మావారు తెప్పించే 'లైఫ్ మేగజైన్'లో చూసి బొమ్మలు పెట్టిన మెట్ల వెనకవున్న వెండితెరలాంటి దానిమీద అపోలో నుండి తీసిన భూగోళాన్ని అదేవిధంగా పెయింట్ చేయించాను 'అందులో సౌత్ ఆఫ్రికా సరిగా కనిపించడం లేదమ్మా' అన్నాడు మావాడు. సౌత్ ఆఫ్రికాను సరిచేసి, పార్వతీ పరమేశ్వరుల్ని, వారబ్బాయి విఘ్నేశ్వరుడితో సహా భూ మండలం మధ్యలో కూర్చోబెట్టాం. మిగతా చిల్లర దేవతలంతా వారికి దిగువ మెట్లమీద కొలువుదీరారు–

మరొకగదిలో మా అమ్మాయి వుంది– (మధుర మీనాక్షి లెండి) రెండు వేపులా లక్ష్మీ సరస్వతులతో, కాళ్ళ దగ్గరున్న గణపతితో, ముందున్న పీటమీద భర్త నటరాజస్వామి నాట్యమాడుతూంటే అలా అందంగా, ఆనందంగా చేతులో చివలతో పధ్నాలుగేండ్లుగా అక్కడే నిలబడి వుందామె – ఆ గదినే అంతా మీనాక్షి హాల్ అంటూంటాం. ఈసారి మా మీనాక్షి హాల్లో మైసూరు బృందావన్ గార్డెన్ కృష్ణరాజసాగర్ 'డామ్'తో సహా 'మినియేచర్' రూపంలో తయారుచేశాం. రంగురంగుల విద్యుద్దీపాల తోనూ, ఫౌంటెన్స్‌తోనూ, చిన్న చిన్న మంటపాల తోనూ, అందమైన ఫ్లవర్‌బెడ్స్‌తోనూ చూడ ముచ్చటగా వుంది. సాక్షాత్తూ విశ్వేశ్వరయ్యలాగా బృందావన్ గార్డెన్స్ 'ఎఫెక్ట్' వున్నదన్నట్లు తీసుకొచ్చావే!" అంటూ మావారే ఆశ్చర్యపడిపోతూ మెచ్చుకొన్నారు మరి – "నిజంగా యిదీ రెండవ ప్రతిసృష్టే!" అంటున్నారు చూసిన వాళ్ళంతా – యింకా పూర్తిగా అయితే కొలువు చాలా బాగుంటుందిలెండి – ఆగం డాగండి – అవతల హాల్లో ఏదో బొమ్మ కింద పడేశాడు – అరెరే! రిక్షావాడు కిందపడ్డాడు. పాపం మోచెయ్యి దాకా విరిగిందీ– అన్నట్లు రిక్షాలో కూర్చున్న బరువైన పంజాబీ దంపతులు కూడా బోర్లా పడ్డారే! క్షమించండి – వాళ్ళకు 'ఫస్టెయిడ్' యివ్వాలి – వుంటాను.

○